సాక్షి
విజయనగరం
గురువారం । 30 । జనవరి । 2025



ఘనంగా పోలమాంబ అనుపోత్సవం - 8లో

శంబర పోలమాంబ అమ్మవారి అనుపోత్సవం బుధవారం ఘనంగా జరిగింది.



విస్తరిస్తున్న కుష్ఠు వ్యాధి

అవగాహన లేకో, అలసత్వమో తెలియదు కానీ కొంతమంది కుష్ఠు వ్యాధి బారిన పడుతున్నారు. - 8లో



2 గంటల్లో మూడు చోరీలు..!

కొంతకాలంగా పోలీసులు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యానికి స్థానికులు మూల్యం చెల్లిస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

కుంభమేళాలో తొక్కిసలాట దురదృష్టకరం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



విజయనగరం రూరల్: ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో చోటుచేసుకున్న తొక్కిసలాట దురదృష్టకరమని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మౌని అమావాస్యనాడు పుణ్యస్నానాలు ఆచరించాలని కోట్లాది మంది వచ్చిన క్రమంలో తొక్కిసలాట చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలకు చెందిన భక్తులు వెళ్లి ఉంటే తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రభుత్వ అధికారుల సూచనలు పాటిస్తూ క్షేమంగా తమతమ ఇళ్లకు చేరుకోవాలని సూచించారు.

సర్వశిక్ష ఏపీసీగా రామారావు బాధ్యతల స్వీకరణ



ఏపీసీగా బాధ్యతలు స్వీకరించిన రామారావు

విజయనగరం అర్బన్: జిల్లా విద్యాశాఖకు సంబంధించిన సర్వశిక్ష విభాగానికి అడిషినల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ (ఏపీసీ)గా డాక్టర్ ఎ.రామారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. దాదాపు రెండేళ్లుగా ఖాళీగా ఉన్న ఈ పోస్టు ఎట్టకేలకు భర్తీయింది. రామారావు ఇంతవరకు పార్వతీపురం మన్యం జిల్లాలోని హార్టికల్చర్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. గజపతినగరం మండలం కొనిస గ్రామానికి చెందిన రామారావు పాఠశాల విద్య ప్రభుత్వ పాఠశాలల్లో చదివి డాక్టర్ ఎన్‌టీఆర్ కాలేజీ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ బాపట్ల కళాశాల, ఆచార్య ఎన్‌జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తిచేశారు. బోధన, పరిశోధన, విస్తరణలో 14 సంవత్సరాల అనుభవం ఉంది. ఆయన చేసిన పరిశోధన వర్క్‌ను ఐపీగవర్నమెంట్ ఆఫ్ ఇండియా సంస్థ పేటెంట్ నమోదు చేసింది. త్వరలో పేటెంట్ అనుమతి పత్రం వస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ప్రతిరోజూ వినతుల స్వీకరణ

- కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించిన జేసీ



కౌంటర్ ప్రారంభించిన జేసీ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: ప్రతిరోజు ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ బుధవారం ప్రారంభించారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా ప్రతిరోజూ ప్రజావినతులు పరిష్కార వేదిక ప్రక్రియను ప్రారంభించినట్టు తెలిపారు. వినతులను అన్ని పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇవ్వవచ్చన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక తరహాలోనే ఈ వినతులను కూడా పరిగణించి, వాటిని ఆన్‌లైన్లో నమోదు చేసి, నంబర్ కూడా కేటాయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ దేవ్ ప్రసాద్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మరియగిరి యాత్ర



మేరిమాత

వీరఘట్టం: వీరఘట్టానికి సమీపంలో యు.వెంకమ్మపేట వద్ద మరియగిరి కొండపై వెలసిన శ్రీకాకుళం మేత్రాసన పాలక పునీతురాలు, క్రైస్తవుల సహాయ మాత మరియమ్మ మహోత్సవానికి వేళయింది. ఏటా జనవరి 30న మరియగిరి యాత్రను నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా గురువారం నిర్వహించే మరియగిరి యాత్రకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కుల, మతాలకు అతీతంగా యాత్రలో భక్తులు పాల్గొంటారు. టెంకాయలు కొట్టి, తలనీలాలు అర్పించి మొక్కులు తీర్చుకుంటారు. మరియమ్మను దర్శించుకొనేందుకు వీలుగా కొండపైన క్యూలు ఏర్పాటు చేశారు. కొండ దిగువన శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి రాయిరాల విజయకుమార్ ఆధ్వర్యంలో జరగనున్న దివ్యపూజకు హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం ప్రార్థనా మందిరాన్ని సిద్ధంచేశారు. ఇప్పటికే ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి చర్చి ఫాదర్‌లు, మఠకన్యలు హాజరై ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. యాత్రా ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

మరో 20 మద్యం దుకాణాలు

- ఉభయ జిల్లాలో గీతకార్మికులకు అవకాశం
- విజయనగరం జిల్లాలో 16, పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు షాపులు
- ఎక్సైజ్ శాఖ ప్రకటనలు జారీ
- జిల్లా యూనిట్‌గా కోటా అమలు
- కేటాయింపుల ప్రక్రియ పారదర్శకతపైనే సందేహాలు!



'కోటా' ప్రకారం కేటాయింపులు...

విజయనగరం జిల్లాలో దుకాణాలు పెట్టే ప్రాంతాలు	గీత కార్మికుల్లో కులాల వారీ కేటాయింపు
విజయనగరం కార్పొరేషన్	శెట్టిబలిజ
జామి మండలం	శెట్టిబలిజ
విజయనగరం రూరల్	యాత
బొబ్బిలి మున్సిపాలిటీ	యాత
బొబ్బిలి రూరల్ మండలం	యాత
నెల్లిమర్ల మండలం	యాత
కొత్తవలస మండలం	యాత
రాజాం రూరల్ మండలం	యాత
గజపతినగరం మండలం	యాత
మెరకముడిదాం మండలం	యాత
సంతకవిటి మండలం	యాత
రాజాం నగర పంచాయతీ	సెగిడి
భోగాపురం మండలం	సెగిడి
పూసపాటిరేగ మండలం	సెగిడి
గరివిడి మండలం	శ్రీసైన
చీపురుపల్లి మండలం	సొండి
పార్వతీపురం మన్యం జిల్లాలో దుకాణాలు పెట్టే ప్రాంతాలు	**గీత కార్మికుల్లో కులాల వారీ కేటాయింపు**
పార్వతీపురం మున్సిపాలిటీ	శ్రీసైన
సాలూరు రూరల్	శ్రీసైన
వీరఘట్టం మండలం	సెగిడి
పాలకొండ మున్సిపాలిటీ	సొండి

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఉభయ జిల్లాల్లో మరో 20 మద్యం దుకాణాలు రాబోతున్నాయి. కూటమి ప్రభుత్వం కొత్త మద్యం విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చిన తర్వాత ఇప్పటికే విజయనగరం జిల్లాలో 153, పార్వతీపురం మన్యం జిల్లాలో 52 మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యాపారులకు అప్పగించింది. వాటిలో ఎక్కువగా టీడీపీ నాయకులకు, వారి కనుసన్నల్లో పనిచేసే సిండికేట్‌లకే దక్కాయి. ఇప్పుడు వాటికి అదనంగా మరో 20 మద్యం దుకాణాలు ఏర్పాటుచేసుకోవడానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జిల్లా యూనిట్‌గా గీతకార్మికుల్లో వివిధ సామాజికవర్గాల వారికి వీటిని కేటాయించారు. అయితే వీటి కేటాయింపులో రాజకీయ ప్రాబల్యం ఉన్నవారి మాటే నెగ్గుతుందేమోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విజయనగరం జిల్లాలో 16, పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. శెట్టిబలిజ, యాత, సెగిడి, శ్రీసైన, సొండి సామాజిక వర్గాలకు చెందినవారు విజయనగరం జిల్లాలోని 16 దుకాణాల్లో కోటా ప్రకారం ఎక్కడివాటికైనా దరఖాస్తు చేసుకోవచ్చని విజయనగరం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్, పార్వతీపురం మన్యం జిల్లా ఇంచార్జి బి.శ్రీనాథుడు తెలిపారు. అలాగే, పార్వతీపురం మన్యం జిల్లాలో శ్రీసైన, సెగిడి, సొండి కులస్థులు నాలుగు దుకాణాల్లో కోటా ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు...

జిల్లా యూనిట్‌గా కోటా ప్రకారం దరఖాస్తు చేసుకోవడానికి ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వం ఫీజు నిర్ణయించింది. ఏ4 మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయిస్తారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారు. 7వ తేదీన విజయనగరం జిల్లాలోని దుకాణాలకు సంబంధించి కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు లాటరీ తీస్తారు. పార్వతీపురం మన్యం జిల్లాలో దరఖాస్తుదారులకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో లాటరీ నిర్వహిస్తారు. ఈ ప్రక్రియలో మద్యం దుకాణాన్ని దక్కించుకున్నవారు లైసెన్స్ ఫీజు (2024–25 సంవత్సరానికి రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్) కింద రూ. 21,66,667 చొప్పున ప్రభుత్వానికి చెల్లించాలి. తదుపరి సంవత్సరం (2025–26) లైసెన్స్ ఫీజు రూ.35.75 లక్షలు చెల్లించాలి.

ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చు....

జిల్లా ఒక యూనిట్‌గా మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ జరిగింది. ఈ ప్రకారం జిల్లాలో ఎక్కడి షాపుకైనా నిర్ణీత కులస్తులు ఆ జిల్లాలోనే దరఖాస్తు చేసుకోవాలి. తాము నివాసం ఉన్నచోటు అంటే కోటా ప్రకారం కుదరకపోవచ్చు. విజయనగరం జిల్లాకు చెందినవారు జిల్లాలోని పది ఎక్సైజ్ స్టేషన్లలో, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందినవారు ఆ జిల్లాలోని 5 ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తు అందించవచ్చు. లేదంటే ఆన్‌లైన్, హైబ్రిడ్ విధానంలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

– బి.శ్రీనాథుడు,
జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి

వేటు తప్పదు

- పీఆర్ ఇంజనీర్లపై మండిపడిన కలెక్టర్
- ఏపీఎంలపైనా తీవ్ర ఆగ్రహం
- పనితీరు బాగులేని నలుగురిపై చర్యలకు ఆదేశం
- ఉపాధి హామీ పనులపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనరం అర్బన్:

పనితీరు మెరుగుపర్చుకోని పంచాయతీరాజ్ ఇంజినీర్లు, ఉపాధి హామీ ఏపీఎంలను సస్పెండ్ చేస్తామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హెచ్చరించారు. ఇన్నాళ్లూ హెచ్చరికలకే పరిమితం అయ్యామని, ఇకనుంచి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఉపాధిహామీ మెటీరియల్ కాంపోనెంట్ పనులు, గోకులాలు, పనిదినాల కల్పనపై కలెక్టరేట్‌లో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా ఫేజ్ 1, 2, 3 పనులపై సమీక్షించారు. పనితీరు బాగులేని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బొబ్బిలి పీఆర్ ఏఈ, సంబంధిత డీఈ, ఇద్దరు ఏపీఎంలకు షోకాజ్ నోటీసులకు సిఫార్స్ చేశారు. ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ కింద సుమారు 280 కోట్ల విలువైన సీసీ, బీటీ రోడ్లు, డ్రైన్లు తదితర 2,851 పనులను 3 దశల్లో మంజూరు చేసినట్టు కలెక్టర్ చెప్పారు. వీటిలో 1,171 పనులను మాత్రమే నేటి వరకు పూర్తి చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడు నెలల్లో కేవలం 40 శాతం పనులు మాత్రమే పూర్తిచేశారని, నిధుల వినియోగం మరింత అధ్వానంగా ఉందన్నారు. జిల్లాకు మంజూరైన రూ.330 కోట్లను రోడ్లు, కాలువలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలన్నారు. అందుబాటులో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోకపోతే వచ్చే ఏడాది నిధులు తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇక నుంచి ఈ పనులపై ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండు పూటలా సమీక్షిస్తామని చెప్పారు. వచ్చేనెల 5వ తేదీలోగా జిల్లాలో మంజూరైన గోకులాలన్నీ పూర్తి కావాల్సిందేనని, లేదంటే చర్యలకు సిద్ధంగా ఉండాలని ఏపీఎంలకు స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ రేపు సాయంత్రంలోగా అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్, డ్వామా పీడీ ఎస్.శారదాదేవి, ఇతర అధికారులు, ఏపీఎంలు పాల్గొన్నారు.



హాజరైన జిల్లా అధికారులు

డీఎఫ్ఓగా కొండలరావు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా అటవీశాఖాధికారిగా ఆర్.కొండలరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం శ్రీకాకుళం డీఎఫ్ఓ ఎస్.వెంకటేష్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఏడాది కాలంగా ఖాళీగా ఉన్న డీఎఫ్ఓ పోస్టును కొండలరావుతో భర్తీ చేశారు. ఆయన రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నట్టు సమాచారం.

లలితమ్మా... ఇదెక్కడి మోసమమ్మా..?



రోడ్డు నిర్మాణంలో అలక్ష్యంపై ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని ప్రశ్నిస్తున్న ఆతవ గ్రామస్తులు




ఎమ్మెల్యే కారు వెళ్లేందుకు వీలుగా ఆందోళనకారులను పక్కకు నెడుతున్న పోలీసులు

ఎన్నికల సమయంలో గ్రామానికి వచ్చారు.. రోడ్డు వేస్తామని మాటిచ్చారు.. అధికారం చేపట్టి ఏడునెలలు పూర్తయినా కనీసం పట్టించుకోలేదు.. రోడ్డుపై రాకపోకలకు నరకయాతన పడుతున్నాం.. ప్రమాదాలకు గురవుతున్నాం.. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి.. హామీ ఇచ్చి మోసం చేయడమేనా..? ఇదేనా మీ పాలన? అంటూ ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని వేపాడ మండలం ఆతవ గ్రామస్తులు ప్రశ్నించారు. వేపాడలో జరిగిన తీర్థానికి వచ్చి తిరిగి వెళ్తున్న ఎమ్మెల్యేను బుధవారం అడ్డుకున్నారు. ప్రశ్నలు సంధించారు. మూడు రోజులుగా ఆందోళన చేస్తున్నా కనీసం పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే కారును అడ్డుకున్న మహిళలను పోలీసులు వారించారు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగింది. అధికారులుతో మాట్లాడి త్వరితగతిన రోడ్డు పనులు జరిగేలా చూస్తామంటూ ఎమ్మెల్యే హామీ ఇచ్చి పోలీసుల సాయంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. సీపీఎం నాయకుడు జగన్, బహుజన సంఘం నాయకుడు ఆతవ ఉదయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో సాగిన ఆందోళనలో జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.అప్పారావు, డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఎంపీపీ సత్యవంతుడు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, జిల్లా వెలమ సంఘం అధ్యక్షుడు బోజంకి రామునాయుడు, గ్రామ సర్పంచ్ వేమననాయుడు తదితరులు పాల్గొన్నారు.

– వేపాడ

అవగాహనతో ప్రమాదాల నియంత్రణ

- ఫిబ్రవరి 15 వరకు రహదారి భద్రత మాసోత్సవాలు
- గతేడాది 98,358పై ఈ చలానాలు విధించాం
- ఎస్పీ వకుల్ జిందల్



విజయనగరం క్రైమ్: రహదారి భద్రతా నిబంధనల ఆచరణతో జిల్లాలో ప్రమాదాలను నియంత్రించవచ్చని ఎస్పీ వకుల్ జిందల్ పేర్కొన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను బుధవారం ఆదేశించారు. వచ్చేనెల 15 వరకు రహదారి భద్రత మాసోత్సవాలు కొనసాగుతాయన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చూడడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఊహించని ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడే రక్షణ రేఖ హెల్మెట్‌ధారణగా పేర్కొన్నారు. బ్లాక్ స్పాట్స్ గుర్తించి ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. గతేడాది హెల్మెట్ ధరించని 6,392 మందిపై ఎం.వి.చలానాలను విధించామన్నారు.


హెల్మెట్ వినియోగం తప్పనిసరి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ద్విచక్రవాహనాలు నడిపేవారికి హెల్మెట్ వినియోగం తప్పనిసరి చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పోలీస్ అధికారులకు సూచించారు. వచ్చే రెండు నెలల్లో పూర్తిగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. హెల్మెట్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కలిగించాలని కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాను ప్రమాదాల రహిత జిల్లాగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. దీనికోసం రవాణా, పోలీస్, జాతీయ రహదారుల, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ సౌమ్యలత, రవాణా డిప్యూటీ కమిషనర్ మణికుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతిమణి, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఆర్టీఓ విమల, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



కోడ్ కూసింది

- అమల్లోకి టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్
- అధికారిక కార్యక్రమాలకు బ్రేక్
- బరిలోకి దిగేందుకు అభ్యర్థుల ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేసింది! బుధవారం ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయడంతో అప్పటి నుంచే కోడ్ కూడా అమల్లోకి వచ్చిందని జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రకటించారు. మార్చి 8వ తేదీ వరకూ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. అప్పటివరకూ ఉత్తరాంధ్రలో భాగమైన విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎలాంటి ప్రభుత్వ కార్యక్రమాలు ఉండబోవు.

ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పదవీకాలం మార్చి నెలలో ముగియనుండటంతో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు తెర లేచింది. ఇందుకు సంబంధించి ఎన్నికల కమిషన్ బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే షెడ్యూల్ విడుదలైప్పటి నుంచి మళ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకూ ప్రవర్తనా నియమావళి (ఎన్నికల కోడ్) అమల్లో ఉంటుంది. ఈ ఎన్నికలకు సంబంధించి నాలుగైదు నెలల క్రితం నుంచే హడావుడి మొదలైంది. ఓటర్ల నమోదు ప్రక్రియను పటిష్ఠంగా పూర్తి చేయడానికి కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగం ప్రత్యేకంగా పనిచేసింది.

3 నుంచి హడావుడి...

శాసనమండలి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికలకు వచ్చే నెల 3వ తేదీన నోటిఫికేషన్ వెలువడనుంది. దీంతోనే ఎన్నికల హడావుడి మొదలవుతుంది. నాటి నుంచి పదో తేదీ వరకూ నామినేషన్లు వేయడానికి అవకాశం ఉంది. 11న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 13వ తేదీ వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. తదుపరి 27వ తేదీన విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నిర్ణీత ఎన్నికల కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగుతుంది. మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఇదంతా సవ్యంగా పూర్తి అయితే ఎన్నికల ప్రక్రియ మార్చి 8వ తేదీతో ముగుస్తుంది. ఎన్నికల కోడ్ అప్పటివరకూ అమల్లో ఉంటుంది.

షెడ్యూల్ ఇలా...

నోటిఫికేషన్ జారీ	3.2.2025 (సోమవారం)
నామినేషన్ల గడువు	10.2.2025 (సోమవారం)
నామినేషన్ల పరిశీలన	11.2.2025 (మంగళవారం)
నామినేషన్ల ఉపసంహరణ గడువు	13.2.2025 (గురువారం)
పోలింగ్ తేదీ	27.2.2025 (గురువారం)
పోలింగ్ సమయం	ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకూ
ఓట్ల లెక్కింపు	3.3.2025 (సోమవారం)

ఎన్నికల సమరానికి సిద్ధం...

సిట్టింగ్ టీచర్స్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మరోసారి పోటీ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఏపీటీఎఫ్–257 (సింగరాజు వర్గం) అభ్యర్థిగా పోటీ చేయవచ్చు. పీఆర్‌టీయూ అభ్యర్థిగా బరిలోకి నిలిచేందుకు మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నాయకుడు గాదె శ్రీనివాసులునాయుడు ఇప్పటికే సమాయత్తమవుతున్నారు. గతంలో రెండు దఫాలు ఎమ్మెల్సీగా పనిచేసిన ఆయనకు ఉపాధ్యాయ వర్గాల్లో పేరుంది. ఏపీటీఎఫ్–1938 (మాజీ ఎమ్మెల్సీ బాలకృష్ణమ్మ వర్గం)కు చెందిన ఆయనకు ఏపీ ఉపాధ్యాయుల సంఘం (ఏపీయూఎస్), ఏపీ టీచర్స్ అసోసియేషన్ (ఏపీటీఏ), బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ), గిరిజన ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం (ఏపీటీడబ్ల్యూఏఎస్)తో పాటు మరికొన్ని ఉపాధ్యాయ సంఘాల మద్దతు ఉందని శ్రీనివాసులునాయుడు చెబుతున్నారు. యూటీఎఫ్ నుంచి బొబ్బిలి ప్రాంతానికి చెందిన కె.విజయగౌరి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుత ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, కె.విజయగౌరి... ఈ ముగ్గురూ విజయనగరం జిల్లాకు చెందినవారే కావడం గమనార్హం. తొలిసారిగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (ఏపీపీఎస్ఎంఏ) నుంచి టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోకి నిలిచేందుకు విశాఖ జిల్లాకు చెందిన సుంకరి శ్రీనివాస్ సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

అట్రాసిటి కేసు నమోదుపై డీఎస్పీ విచారణ


విచారణ చేస్తున్న డీఎస్పీ రాంబాబు, పక్కనే ఎస్సై కళాధర్

వీరఘట్టం: మండలంలోని బూరుగ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని కులంపేరుతో దూషించి, బెదిరింపులకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుపై బుధవారం పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు వీరఘట్టంలోని బార్నాలవీధికి వచ్చి విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులతో పాటు కేసు నమోదైనవారు, సంఘటనా స్థలంలో ఉన్నవారితో మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు.ఫిర్యాదుదారు ఇచ్చిన సమాచారం ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఆయనతో పాటు వీరఘట్టం ఎస్సై జి.కళాధర్ ఉన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

వీరఘట్టం: మండలంలోని కొంచ గ్రామం శివారులో ఉన్న జీడితోటలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను బుధవారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కళాధర్ తెలిపారు. వారి నుంచి రూ.32,150లను స్వాధీనం చేసుకుని, 4 బైక్‌లను సీజ్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఈ నెల 31 వరకు అవకాశం

పార్వతీపురంటౌన్: టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం డేటాలో అప్‌డేట్ చేసేటప్పుడు ఆన్‌లైన్‌లో ఏమైనా తప్పుగా నమోదు చేసినట్లయితే వాటిని సరిదిద్దుకోవడానికి ఈనెల 31 వరకు అవకాశం ఇచ్చామని డీఈఓ ఎన్. తిరుపతి నాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏ ఉపాధ్యాయుడు అయితే తప్పుగా నమోదు చేసి ఉన్నారో వారు శుక్రవారం లోపు తిరిగి నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

చీటింగ్ కేసులో ముద్దాయికి ఆరునెలల జైలు, జరిమానా

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో 2019లో నమోదైన చీటింగ్ కేసులో ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష, రూ. 8వేలు జరిమానా విధిస్తూ ఏజేఎఫ్‌సీఎం కోర్టు తీర్పు వెల్లడించినట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. గజపతినగరం మండలం పురిటిపెంటకు చెందిన చలుమూరి వెంకట భాస్కరరావు అనే నిందితుడు ఐటీ మోసానికి పాల్పడడంతో బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి వన్‌టౌన్ సీఐ డి.లక్ష్మణరావు కేసు నమోదుచేసి, 2019 మే 31న రిమాండ్‌కు తరలించి, కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. వన్‌టౌన్‌పోలీసులు ఈ కేసులో ప్రాసిక్యూషన్ సమయంలో సాక్ష్యాలను ప్రవేశపెట్టడంతో ముద్దాయికి ఆరు నెలల జైలు, రూ. 8వేలు జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ కుమారి పి.బుజ్జి తీర్పు వెల్లడించినట్లు వన్‌టౌన్ సీఐ వివరించారు.

పశువుల వ్యాన్ సీజ్

దత్తిరాజేరు: పార్వతీపురం మన్యంజిల్లా పరుశరాంపురం నుంచి అలమండకు ఆరు పశువులను తరలిస్తున్న బొలెరో వ్యాన్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు పెదమానాపురం ఎస్సై రాజేష్ బుధవారం తెలిపారు. స్టేషన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమతులు లేకుండా వ్యాన్‌లో పశువులు ఉండడాన్ని గమనించి పశువుల యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

సారాతో పట్టుబడిన మహిళకు రిమాండ్

కొత్తవలస: వేపాడ మండలంలోని కృష్ణారాయుడుపేట గ్రామంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.ఎస్.రాజశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో 5 లీటర్ల సారాతో సిమ్మ ఈశ్వరమ్మ అనే మహిళ పట్టుబడింది. ఈ మేరకు ఆమెపై కేసు నమోదు చేసి కొత్తవలస కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో విశాఖపట్నంలో గల సెంట్రల్ జైలుకు తరలించినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు ఎన్.రమశ్రీ, వీఎస్.రాజు, సిబ్బంది బి.రాముడు, వీర్రాజు, ప్రసాద్, ఆదినారాయణ పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220

ఘనంగా పోలమాంబ అనుపోత్సవం

వనంగుడికి చేరుకున్న అమ్మవారి ఘటాలు ● వచ్చేనెల 4న అమ్మవారి మారుజాతర


అమ్మవారికి మొక్కుబడిగా ఘటం చెల్లిస్తున్న భక్తురాలు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి అనుపోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. జన్నివారి ఇంటివద్ద పూజలందుకున్న అమ్మవారి ఘటాలు చదురుగుడి నుంచి మంగళవారం మధ్యాహ్నం 2.50 గంటలకు తిరువీధి కార్యక్రమానికి బయల్దేరి ముందుగా గిరడ, పూడి, కుప్పిలి వారిళ్లలో తొలి పూజలు అందుకున్నాయి. అక్కడినుంచి గ్రామంలోని అన్ని పుర వీధుల్లో అమ్మవారి ఘటాలకు తిరువీధి నిర్వహించి, బుధవారం ఉదయం 9.20గంటలకు ప్రధాన వీధిలోని అమ్మవారి ఉత్సవగద్దెకు అమ్మవారి ఘటాలు చేరుకున్నాయి. ఉత్సవగద్దె వద్ద అమ్మవారి ఘటాలకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఘటాలు, పాలధారకు ఉయ్యాల కంబాల కార్యక్రమాన్ని గ్రామపెద్దలు, ఉత్సవకమిటీ సభ్యులు నిర్వహించారు. ఉత్సవగద్దె(యాత్రాస్థలం)నుంచి అమ్మవారి ఘటాలు కాలినడకన భక్తుల జయజయధ్వానాల నడుమ వనంగుడికి చేరుకున్నాయి. వనంగుడికి చేరుకున్న ఘటాలతో వనంగుడి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణచేసి, వనంగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారి పాదాల చెంత ఘటాలను ఉంచారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. వచ్చేనెల 4వతేదీన అమ్మవారి మారు జాతరను నిర్వహిస్తారు.


ప్రధానాలయం వీధిలో అమ్మవారి ఘటాలు


అమ్మవారి ఘటాల అనుపోత్సవంలో పాల్గొన్న భక్తులు


అమ్మవారి గద్దె వద్ద ఘటాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు


తప్పెటగుళ్లు

విస్తరిస్తున్న కుష్ఠు వ్యాధి

- ఇంటింటి సర్వేలో అనుమానితుల గుర్తింపు
- ఈనెల20 నుంచి ప్రారంభమైన సర్వే
- ఇంతవరకు 1879 మంది అనుమానితులు
- 736 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- ఆరుగురికి వ్యాధి నిర్ధారణ


గంట్యాడ మండలంలోపెదవేమలిలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: అవగాహన లేకో, అలసత్వమో తెలియదు కానీ కొంతమంది కుష్ఠు వ్యాధి బారిన పడుతున్నారు. వ్యాధి లక్షణాలు కనిపించినప్పటికీ అలసత్వం వహించడం వల్ల వ్యాధి బారిన పడుతున్నారు. ఫలితంగా చాపకింద నీరులా కుష్ఠు వ్యాధి వ్యాప్తి చెందుతోంది. కుష్ఠు రోగులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న సర్వేలో కొత్త కేసులు నమోదవుతున్నాయి. వ్యాధి తీవ్రమై అంగవైకల్యం బారిన పడే వరకు కొంతమంది కుష్ఠు వ్యాధి సోకిందని తెలుసుకోలేక పోతున్నారు. కుష్ఠు వ్యాధి లక్షణాల గురించి బయటకు చెబితే ఏం అనుకుంటారోనని అనుమానంతో వ్యాధి తీవ్రమయ్యే వరకు చాలా మంది చెప్పడం లేదు. దీంతో కుష్ఠు కేసులు పెరుగుతున్నాయి. వ్యాధిని త్వరగా గుర్తించడం వల్ల వ్యాధి వ్యాప్తిని అరికట్టడంతో పాటు రోగులు అంగవైకల్యం బారిన పడకుండా కాపాడడానికి అవకాశం ఉంటుంది.

1879 కొత్త కేసుల నమోదు

జిల్లాలో ఈనెల20వతేదీ నుంచి కుష్ఠు వ్యాధిపై సర్వే పారంభం అయింది. ఫిబ్రవరి 2వతేదీ వరకు ఈ సర్వే జరగనుంది. జిల్లాలో రెండేళ్ల వయసు దాటిన ప్రతి ఒక్కరికీ కుష్ఠు వ్యాధిపై సర్వే చేసి స్క్రీనింగ్ చేయనున్నారు. ఇప్పటివరకు జరిగిన సర్వేలో 1879 మంది అనుమానితులను గుర్తించారు. వారిలో 736 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఇందులో 6 కొత్త కేసులు నమోదయ్యాయి. ఇంకా 1143 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాల్సి ఉంది.

రెండు రకాలుగా చికిత్స

- పాసీ బ్యాసిల్లరీ (పి.బి) అంటే కుష్ఠు వ్యాధి సోకిన వ్యక్తికి ఒకటి నుంచి ఐదు మచ్చలు ఉంటే వారిని పాసీ బ్యాసిల్లరీగా గుర్తిస్తారు. వారికి ఆరు నెలల చికిత్స ఉంటుంది.
- మల్టీ బ్యాసిల్లరీ(ఎం.డి) అంటే ఐదు మచ్చల కంటే ఎక్కువ మచ్చలు ఉంటే వారిని మల్టీ బ్యాసిల్లరీగా గుర్తిస్తారు. వారికి 12 నెలలు చికిత్స ఉంటుంది.

వ్యాధి లక్షణాలు :

- చర్మంపై స్పర్శలేని మచ్చలు
- మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, బత్తాయి తొక్కలాగా ఉండడం
- చెవులపై, వీపుపై, ఎదపై నొప్పి లేని బొడిపెలు
- కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం
- ముక్కు దిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం
- కాళ్లు, చేతులు తిమ్మిర్లు లేక జోములు కలిగి ఉండడం
- అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం
- చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- కాళ్లకు చెప్పులు జారిపోవడం
- తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం
- చేతి వేళ్లు, కాలి వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం

వ్యాధి సోకేది ఇలా..

కుష్ఠు వ్యాధి మైకో బాక్టీరియం లెప్రే అనే బాక్టీరియా వల్ల చర్మానికి, నరాలకు సోకుతుంది. ఆ వ్యాధిగ్రస్తులు తుమ్మినా, దగ్గినా తుంపర్ల ద్వారా దగ్గరలో ఉన్న వారికి కూడా వ్యాధిసోకే ప్రమాదం ఉంది.

అనుమానితులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు:



కుష్ఠు వ్యాధిపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో గుర్తించిన అనుమానితులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపడతాం, అదే విధంగా వ్యాధి నిర్ధారణ అయిన వెంటనే చికిత్స ప్రారంభిస్తాం. 58 శాతం సర్వే ఇప్పటి వరకు పూర్తయింది. ఫిబ్రవరి 2 వతేదీతో సర్వే పూర్తవుతుంది. రెండేళ్లు దాటిన ప్రతి ఒక్కరికి కుష్ఠు వ్యాధిపై స్క్రీనింగ్ చేస్తున్నాం.

డాక్టర్ కె. రాణి,
జిల్లా కుష్ఠు వ్యాధి నివారణ అధికారి

2 గంటల్లో మూడు చోరీలు..!

- షట్టర్లు విరగ్గొట్టి దోపిడీ


దొంగలు పడిన కొరియర్ సర్వీస్ దుకాణం

శృంగవరపుకోట: కొంతకాలంగా పోలీసులు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యానికి స్థానికులు మూల్యం చెల్లిస్తున్నారు. మంగళవారం రాత్రి ప్రధాన రహదారిలో రెండు గంటల వ్యవధిలో మూడు దుకాణాలను దొంగలు దర్జాగా దోచుకుని పోలీసులకు సవాల్ విసిరారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు రెండున్నర గంటల సమయంలో సీతంపేట నుంచి ఎస్.కోట వస్తున్న ప్రధాన రహదారిలో కొరియర్ సర్వీసు నిర్వహిస్తున్న దుకాణం షట్టర్‌ను విరిచి షాపులో చొరబడ్డారు. సీసీ కెమెరాలు ఉన్నా ఏమాత్రం బెరుకు లేకుండా, కెమెరాలు విరగ్గొట్టి కౌంటర్‌లో ఉన్న రూ.70వేలు దోచుకున్నారు. మరో కిలోమీటర్ దూరం ముందుకొచ్చి వన్ వే జంక్షన్ వద్ద ఆర్.కె. వైన్‌షాపు షట్టర్ ఎత్తి లోనికి చొరబడ్డారు. దుకాణంలో నుంచి మందుబాటిల్స్ పట్టుకుపోయారు. అక్కడితో ఆగకుండా విశాఖ–అరకు ప్రధాన రహదారిలో ఉన్న అరుణాచల ట్రేడర్స్ పేరుతో ఉన్న హోల్‌సేల్ కిరాణా దుకాణంలో చొరబడి దుకాణంలో నుంచి ఆరు ఆయిల్ డబ్బాలు, నాలుగు రైస్ బ్యాగ్‌లు, రూ.20వేలు నగదు దోచుకున్నారని యజమాని చెప్పారు.

పర్యవేక్షిస్తున్న సీఐ

పట్టణంలో ఒకే రాత్రి మూడు దుకాణాల్లో జరిగిన చోరీలతో పట్టణ వాసులు ఉలిక్కిపడ్డారు. చోరీ జరిగిన దుకాణదారులు ఇచ్చిన ఫిర్యాదుతో సీఐ వి.నారాయణమూర్తి తన సిబ్బందితో కలిసి చోరీ అయిన దుకాణాలను పరిశీలించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

11,400 మంది విద్యార్థులకు బెడ్స్ సరఫరాకు చర్యలు

- కిల్లోయిలో రూ.2.7 కోట్లతో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు
- ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి


మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు 11,400 మందికి బెడ్స్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మందస మండలం కిల్లోయిలో రూ.2.7 కోట్లతో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో మూతపడిన 32 జీపీఎస్ పాఠశాలలను వచ్చే విద్యాసంవత్సరం నాటికి తెరిపించనున్నామని పేర్కొన్నారు. పక్కా భవనాలు లేని 7 పాఠశాలలకు భవనాలు నిర్మించనున్నామన్నారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోనున్నామని తెలియజేశారు. ఇందుకోసం ఆర్‌డబ్ల్యూఎస్‌తో సమన్వయ సర్వే చేయించనున్నట్లు తెలిపారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీటిని గిరి శిఖర గ్రామాలకు సరఫరా చేయనున్నామన్నారు. ఆడలి వ్యూపాయింట్‌కు వెళ్లే మార్గంలో ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా నాలుగు చోట్ల రహదారి విస్తరణ, రక్షణ గోడలు నిర్మించనున్నామని చెప్పారు.

71 రహదారుల నిర్మాణం

మెరుగైన వైద్యసేవలు అందించడానికి రూ.75.26 లక్షలతో అవసరమైన పరికరాలు కొనుగోలు చేయడానికి ప్రణాళికలు తయారు చేశామని తెలిపారు. 72 గిరిజన గ్రామాలకు 71 రహదారులు నిర్మించనున్నామన్నారు. గతంలో రైతులకు సరఫరా చేసిన మారిషస్ పైనాపిల్ మంచి దిగుబడి ఇవ్వనుందని గిరిజనులు చెబుతున్నారన్నారు. ఇప్పటికే సర్వే చేశామన్నారు. 53 వీడీవీకేలు ఏర్పాటు చేసి వారు ఉత్పత్తి చేసిన కొండచీపుళ్లు, జీడిపప్పు, ఇతర గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు.

ఏపీఎస్ఎస్డీసీ ద్వారా రెండు నైపుణ్య కార్యక్రమాలు


జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య

పార్వతీపురంటౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారికంగా రెండు నైపుణ్య కార్యక్రమాలను ప్రారంభించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీఎస్ఎస్డీసీ డిజిటల్ భవిష్యత్తు కోసం అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు సాధికారత కల్పించేందుకు నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్ ప్రైమ్ సహకారంతో అధికారికంగా రెండు సంచలనాత్మక కార్యక్రమాలను ప్రారంభించిందని పేర్కొన్నారు. అందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అసెండ్ ప్రోగ్రామ్ ఒకటన్నారు. ఫ్యూచర్ ఇన్నోవేటర్‌లకు సాధికారత టీమ్ గ్రాడ్యుయేట్లు, ఇంజినీరింగ్ విద్యార్థులు (2, 3 ఇయర్) పని చేసే నిపుణులను లక్ష్యంగా చేసుకుని, ఈ ప్రోగ్రామ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇతర అధునాతన సాంకేతికతలపై లోతైన అభ్యాసాన్ని అందిస్తుందని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ ప్రోగ్రామ్ కోసం ఈ నెల 30వ తేదీలోగా తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. రెండవ ప్రోగ్రాం డిజిటల్ 101 అని అన్నారు. ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థుల కోసం రూపొందించిన ఈ కార్యక్రమం, డిజిటల్ యుగంలో అభివృద్ధి చెందడానికి వారికి పునాది జ్ఞానాన్ని అందించి, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను పరిచయం చేస్తుందని తెలిపారు. ఆసక్తి గలవారు ఫిబ్రవరి 5 నుంచి 12వ తేదీలోగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ రెండు ప్రోగ్రామ్‌ల నాస్కాం సహకారంతో ఉచిత కోర్సు పూర్తి, ధృవీకరణ పత్రాలను అందిస్తాయని, నేటి జాబ్ మార్కెట్‌లో పాల్గొనేవారికి పోటీతత్వాన్ని అందించనున్నట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ కోసం హెచ్‌టీటీపీ://ఇంజనీరింగ్.ఏపీఎస్ఎస్డీసీ.ఇన్ రిజిస్టర్ లింకును ఓపెన్ చేయాలని, మరింత సమాచారం కోసం ఫోన్ 9988853335, 70363 88297 నంబర్లన సంప్రదించాలని ప్రకటనలో కోరారు.

పరిమితికి మించి ప్రయాణాలపై అవగాహన కల్పిస్తున్నాం

- జిల్లా రవాణా శాఖాధికారి టి. దుర్గాప్రసాద్ రెడ్డి

పార్వతీపురంటౌన్: పరిమితికి మించి జీపు, ఇతర వాహనాల్లో ప్రయాణించడం వల్ల కలిగే రహదారి ప్రమాదాలపై సాలూరు ఇంధన శకట తనిఖీదారు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా రవాణా శాఖాధికారి టి.దుర్గా ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొఠియా పరిధిలోని ప్రజలు జీపుల పైభాగంలో కూర్చుని, వెనుక నిల్చొని ప్రయాణించడం వల్ల కలిగే నష్టాలపై తెలియజేస్తునట్లు చెప్పారు. అలాగే జీపు యజమానులు, డ్రైవర్లకు పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణించడం వల్ల కలిగే రోడ్డు ప్రమాదాల గురించి వివరిస్తున్నట్లు చెప్పారు. కొఠియా పరిధిలో ఆర్టీసీ సౌకర్యం లేనందున, నంద గ్రామం వరకు ఉదయం, సాయంత్రం ఒక్క బస్సు మాత్రమే ఉన్నందున జీపుల పై భాగంలో కూర్చుని, వెనుక నిలబడి వేలాడుతూ రావాల్సిన పరిస్థితి వస్తోందని గ్రామస్తులు తెలిపారన్నారు. ఆర్టీసీ సిబ్బందితో మాట్లాడి మరిన్ని బస్సులను ఏర్పాటుచేసే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు.


గంజాయితో నలుగురి అరెస్ట్


గంజాయి కలిగి ఉన్న నిందితులను అదుపులోకి తీసుకుని వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ

విజయనగరం క్రైమ్: స్థానిక కంటోన్మెంట్ ఏరియా రైల్వే కాలనీ ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి నలుగురు అనుమానిత వ్యక్తులను పట్టుకుని విచారణ చేశారు. వారి దగ్గర నుంచి సుమారు రెండుకిలోల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను విచారణ చేసి వారిలో ఇద్దరు ఎస్.కోటకు చెందిన బోరమాల తరుణ్ తేజ, సంపంగి భార్గవ్, పట్టణానికి చెందిన సిరికి సాగర్, జొన్నగుడ్డికి చెందిన పావాడ సాయి చైతన్యలుగా గుర్తించామన్నారు. నలుగురు వ్యక్తులు గంజాయిని కొనుగోలు చేసి, చిన్న ప్యాకెట్లుగా చేసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు విచారణలో గుర్తించామన్నారు. గూడ్స్‌షెడ్ వద్ద బుధవారం గంజాయి అమ్మకాలు చేస్తుండగా పట్టుకుని, రెవెన్యూ అధికారుల సమక్షంలో తనిఖీ చేసి, వారి నుంచి రెండుకిలోల గంజాయిని సీజ్ చేశామన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. వారితో పాటు ఒక మైనర్ ఉన్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంలో క్రియాశీలకంగా పనిచేసిన వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రామగణేష్, ఇతర పోలీసు సిబ్బందిని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు అభినందించారు.


జాతీయ రహదారిపై లారీ బీభత్సం

- ప్రమాదంలో నుజ్జునుజ్జయిన మోటార్ సైకిల్, కారు
- ముగ్గురికి తీవ్రగాయాలు, ఒకరి పరిస్థితి విషమం


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు, మోటార్ సైకిల్

బొండపల్లి: మండల కేంద్రాన్ని అనుకొని బోడసింగి పేట గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి26పై వేగంగా వస్తున్న లారీ అదుపు తప్పి ఢీకొట్టడంతో లారీ ముందు వెళ్తున్న కారుతో పాటు మోటార్ సైకిల్ పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. బుధవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. గజపతినగరం నుంచి విజయనగరం వెళ్తున్న లారీ వేగంగా వస్తూ అదుపుతప్పి ముందు వెళ్తున్న కారును బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. అలాగే కారు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని కూడా బలంగా లారీ ఢీకొట్టడంతో ప్రమాదంలో మోటార్ సైకిల్ పూర్తిగా నుజ్జయింది. ద్విచక్ర వాహనంపై వస్తున్న సీతానగరం మండలం భద్రంవలస గ్రామానికి చెందిన బలజాన ముకుందకు తీవ్ర గాయాలు కావడంతో పాటు కాలు పూర్తిగా విరిగి పోయింది. ఇదే ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మరొకరితో పాటు ద్విచక్ర వాహనం వెనుక ఉన్న మరొకరికి గాయాలయ్యాయి. గాయపడిన ముగ్గురిని 108 వాహనంలో విజయనగరంలోని మహరాజా కేంద్ర సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముకుందకు మరో పది రోజుల్లో పెళ్లి కావాల్సి ఉండగా శుభలేఖలు పంచడానికి వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు.

తాలాడ ప్రాంతంలో ఏనుగులు


ఘనసర నుంచి తాలాడ వైపు తరలి వెళ్తున్న ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని తాలాడ సమీప పంటపొలాల్లో నాలుగు ఏనుగుల గుంపు బుధవారం ఆందోళన సృష్టించింది. సమీప గ్రామమైన ఘనసర పంటపొలాల్లో పంట చేలు ధ్వంసం చేశాయి. అనంతరం నాటుదారి వెంబడి తాలాడ పంట పొలాల్లోని మొక్కజొన్న పంటపైకి వెళ్లాయి. రెండవ పంటగా వేసుకున్న మొక్కజొన్న, కర్బూజా, చెరకు, ఇతర పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేసి తిని వేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి


మృతి చెందిన సంతోష్

పార్వతీపురంటౌన్: పట్టణలోని ఫ్లైఓవర్‌పై బుధవారం బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు పట్టణ ఏఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఎస్ఎన్‌పీ కాలనీకి చెందిన రావువల్లి సంతోష్ కుమార్ (36) పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. భోజనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఫ్లైఓవర్ పై బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు.